క్లుప్తంగా

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు



కాకుమాను: పెదనందిపాడు మండలంలోని వరగాని అంకమ్మ తల్లి గుడి ఆవరణలో గత మూడు రోజుల నుంచి లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్సిన అమృతం', అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'మనస్విని', ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి 'విముక్తి' నాటికలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన నాటిక పోటీలు ఆహూతులను అలరించాయి.

సేంద్రియ సాగుపై శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: రైతునేస్తం ఫౌండేషన్, కర్షక సేవా కేంద్రం నిర్వహణలో సేంద్రియ సాగు, కషాయాలు, మిశ్రమాల తయారీ, వివిధ ఆహార పంటలకు విలువ జోడింపుపై 3 రోజుల రైతు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌లో జూన్ 1 నుంచి 3 వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666, 95538 25532 నంబర్లలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

శివకుమార్ నియామకం



గుంటూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ కొమ్మెర్ల శివ కుమార్‌ను నియమించటం జరిగిందని పరిరక్షణ మండలి అధ్యక్షుడు బుల్లా రాజారావు తెలిపారు. గురువారం విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన మండలి రాష్ట్ర సమావేశంలో ఈ తీర్మానం చేయటం జరిగిందన్నారు. గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామానికి చెందిన శివకుమార్ ప్రొఫెసర్‌గా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని తెలిపారు. 2024 మే 22 నుంచి 2026 డిశంబర్ 31 వరకు ఆయన చైర్మన్‌గా పదవిలో ఉంటారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ఎల్లపుడూ కృషి చేస్తానని శివకుమార్ తెలిపారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి



నంబూరు వీవీఐటీలో మాట్లాడుతున్న మేజర్ పారుల్ శర్మ



ఆయుధాలు ఉపయోగించడంపై ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

పెదకాకాని: మహిళలు అన్ని రంగాలలోనూ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్, ఏడీ శిక్షణ అధికారి మేజర్ పారుల్ శర్మ అన్నారు. మండలంలోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహిస్తున్న 10 ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు రక్షణ రంగంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. స్వతంత్రంగా, స్వశక్తితో ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. పది రోజులు పాటు నిర్వహించనున్న ఈ శిబిరంలో రెండో రోజు కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ బాలికల క్యాడెట్స్‌కు ఆయుధాలను ఉపయోగించే తీరు, డ్రిల్, టెంట్ పిచింగ్ అంశాలలో శిక్షణ ఇచ్చారు.

మేజర్ పారుల్ శర్మ

కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఆళ్ల శ్రీవాణి, గుంటూరు బెటాలియన్ ఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు



లక్ష్మీ నరసింహస్వామి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

తాడేపల్లిరూరల్ : మంగళగిరిలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు గురువారంతో అంగరంగ వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రామ కోటిరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకల్లో భాగంగా చివరి రోజున ఉదయం 7 గంటలకు నారసింహ మూలమంత్ర హోమం ఘనంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస దీక్షితులు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన

చేబ్రోలు: అన్నమాచార్యుని జయంతి సందర్భంగా మండల కేంద్రమైన చేబ్రోలులో భరత నాట్య ప్రదర్శన, కోలాట ప్రదర్శన, సామూహిక హారతి కార్యక్రమం ఘనంగా జరిగింది. చేబ్రోలులోని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వైశాఖ పౌర్ణమి, బుద్ధ పౌర్ణమి, అన్నమాచార్యుల వారి 616వ జయంతి సందర్భంగా స్థానిక అన్నపూర్ణ సత్రం సమీపంలోని రామ మందిరంలో సామూహిక హారతి జరిగింది. అన్నమాచార్యుల జయంతి సందర్భంగా మంచాల వారి కోలాట భక్త బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన జరిగింది. చిన్నారులు పోలం రేణ్యశ్రీ,, రుషికల భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉదయగిరి శ్రీను ఆధ్వర్యంలో అన్నమాచార్యుని కీర్తనలు, పౌరాణిక పద్యాలు ప్రదర్శించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ పోలం ప్రసాదరెడ్డి, మండల కన్వీనర్ చదలవాట హేమలత, ధార్మిక సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సచివాలయంలో గురువారం పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మద్యం, పొగాకు ఉత్పత్తులు వాడేవారు తప్పనిసరిగా ఈ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. తాడేపల్లి ప్రాథమిక కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ గురుకుమార్, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి, రక్త హీనతను నివారించవచ్చని వైద్యాధికారి శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్ నెస్ సెంటర్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 254 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం తీసుకోవడం ద్వారా కలిగే లాభాలు, తల్లి పాల ప్రయోజనాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి. ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎఎన్ఎం మాబు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సుల్తానాబాద్‌లోని ఓ దుకాణంలో దాని నిర్వాహకుడు తన సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి వెళ్లాడు. దుకాణానికి వెళ్లిన ముగ్గురు యువకులు సెల్‌ఫోన్ అపహరించుకెళ్లారు. కేసు నమోదు చేసి నిందితులను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్టు ఎస్ఐ నక్కా ప్రకాశరావు తెలిపారు.

చూచిన కనులదే భాగ్యము!

వైభవంగా సాక్షి భావన్నారాయణ స్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



డప్పు కళాకారుల సందడి

పొన్నూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామివారి దివ్య రథోత్సవం స్వర్ణపురి పురవీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గరుడోత్సవం, మధ్యాహ్నం దేవస్థానంలో బ్రాహ్మణ సమారాధన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం పూలతో విశేషంగా అలంకరించిన రథంపై స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దంపతులు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ బహదుర్ మన్నే సుల్తాన్ దొర పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, స్వామివారి నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. ఆలయ ప్రాంగణం నుంచి కసుకర్రు రోడ్డు వరకు రథోత్సవం సాగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మజ్జిగ, తాగునీరు అందించారు. పీటీ చౌదరి, కృష్ణయ్య, కమలేంద్రనాథ్, ఎస్.ఎస్.కే.ఆర్.భట్టాచార్యులు, అర్చకులు గోవర్ధనం రామకృష్ణ, కిషోర్ బాబు, దాసరి నారాయణరావు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సహాయ కమిషనర్, ఆలయ ఈఓ మండేపూడి పానకాలరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

శస్త్ర చికిత్సలో వైద్యుని నైపుణ్యత పైనే ఫలితాలు



ప్రశంసా పత్రాలతో వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరులోని ఓ హోటల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిరంతర వైద్య విద్యా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి.జగదీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ జి.జగదీష్ మాట్లాడుతూ.. వైద్యులు మల్టిపుల్ ఫ్రాక్చర్స్ విషయంలో సరైన నిర్ణయం, సక్రమ శస్త్ర చికిత్స ద్వారా బాధితులకు మళ్లీ సాధారణ జీవితాన్ని అందించవచ్చునన్నారు. ఇదే ప్రథమ లక్ష్యం కావాలని యువ వైద్యులకు తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎస్ఎస్ హరిత 'హార్ట్ ఫెయిల్యూర్ జీవితానికి అంత్య దశ' అనే అంశంపై ప్రసంగించారు. హార్ట్ ఫెయిల్యూర్ గుండె సంబంధ వ్యాధుల్లో అంత్య దశ కాదని చికిత్స ద్వారా మళ్లీ తిరిగి గుండెను మామూలు స్థితికి తీసుకురావచ్చన్నారు. డాక్టర్ జి.జగదీష్, డాక్టర్ చిత్తరంజన్ సాహు, డాక్టర్ పీఎంస్ హరితలకు ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.సాయి కృష్ణ, రమేష్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మమత ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చిత్తరంజన్ సాహూ, డాక్టర్ టి.సేవకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య జయంతి వేడుకల్లో..

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం అన్నమయ్య జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు సతీష్ స్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు ప్రత్యేక అర్చనలు, అలంకరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎంవై.శేషురాణి, కాజా వేంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొనసాగిన ధారావాహిక ప్రవచనం

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఐదు రోజుల పాటు నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీత – ఆత్మ సంయమయోగః ధారా వాహిక ప్రవచనం గురువారం కొనసాగింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. జరుబుల బంగారుబాబు సౌజన్యంతో పూజ్యశ్రీ సువీరానందస్వామి (చిన్మయ మిషన్) నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో కృష్ణ కిషోర్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని గుంటూరు చానల్ సమీపంలో ప్రైమ్ గ్రైండర్ సంస్థ నిర్వాహకుడు పి.శ్రీనివాసరావుపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నేత కృష్ణకిషోర్ డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరిలో ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దిగువ మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తూ దారి లేకుండా ఉన్నట్లు మ్యాప్‌లో చూపించి ప్రైమ్ గ్రైండర్ సంస్థ నిర్వాహకులు శ్రీనివాసరావు మోసపూరిత కాగితాలతో అక్రమ కట్టడాలు కట్టి సంస్థలో పెట్టుబడి పెట్టించి, ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ విల్లాలకు పర్మిషన్ లేదని, సీఆర్‌డీఏ వారు రద్దు చేసి నాలుగు సంవత్సరాలు అయ్యిందని చెప్పారు. మంగళగిరి మున్సిపల్ కార్యాలయంలో ఆయనకు నోటీసులు ఇవ్వడం కూడా జరిగిందని పేర్కొన్నారు. ప్రైమ్ గ్రైండర్ విల్లాస్‌లో ప్లాట్లు కొన్న ప్రజలు అప్రమత్తత అవ్వాలని కిషోర్ కోరారు. మేని ఆంజనేయులు, నక్కా నాగరాజు, కొరగంటి రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



తాడేపల్లిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చంగయ్య మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనేక సార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేశామని, కానీ ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న జీతాలను కార్మికులకు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.కమలాకర్, మున్సిపల్ యూనియన్ నాయకులు సీహెచ్. శివపార్వతి, ఎం.నరసింహారావు, సి.స్వామి, వి.అరుణ, ఎం.తిరుపతమ్మ, పి.వెంకటేశ్వర్లు, వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు వెంటనే పూర్తి చేయండి

తెనాలిఅర్బన్: 32వ వార్డులోని కొడాలి వీరయ్య మున్సిపల్ పార్కులోని మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. గురువారం పార్కును పరిశీలించారు. అక్కడ చేస్తున్న మరమ్మతులపై ఆరా తీశారు. అనంతరం 25వ వార్డులో పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంచినీటి సరఫరాకు ఎటువంటి అంతరాయలు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ రాజు, హార్టికల్చరల్ ఆఫీసర్ శేషుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

- విస్తృతమవుతున్న తెనాలి బ్లడ్ బ్యాంక్ సేవలు
- ప్లేట్‌లెట్స్ సేకరించే యూనిట్‌కు అనుమతులు
- త్వరలో తెనాలి రానున్న పరికరాలు

'ప్రాణం అంతా రక్తంలోనే ఉంది. రక్తదానం చేసి ప్రాణదాతలు కండి.', 'నువ్వు ఇచ్చే రక్తం.. మరోకరికి జీవితము–ప్రాణము', 'తల్లి కన్నీరు కాపాడలేని బిడ్డ ప్రాణాన్ని మీ రక్తదానం కాపాడొచ్చు.. రక్తదానం చేయండి అది ఓ ఆశని, ఒకరికి జీవితాన్ని ఇస్తుంది.', ' అన్నదానం ఆకలిని తీర్చుతుంది..రక్తదానం ఒకరికి ప్రాణం నిలబెడుతుంది.' అంటూ ఇలా ఎన్నో వాక్యాలు రక్తదానం చేయమని చెబుతూ.. ఎందరో ప్రాణాలు నిలుపుతున్నాయి. అలా దాతల నుంచి సేకరించి రక్తాన్ని భద్రపరిచి అత్యసరమైన రోగులకు దానిని అందించి సకాలంలో వారి ప్రాణాలు నిలబెడుతోంది తెనాలిలో జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్.

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ సేవలు విస్తృతం అవుతున్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ రక్త సేకరణ, వాటిని పరీక్షించి అవసరమయిన రోగులకు పంపిణీ చేయటం వరకు జరుగుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని అప్‌గ్రేడ్ చేయటంతో పాటు దీనిలో రక్తం నుంచి ప్లేట్‌లెట్స్, పాకర్ సేల్స్ వంటి వాటిని వేరు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గత ఏడాది డిసెంబర్‌లో అనుమతులు ఇచ్చింది. దానికి సంబంధించిన పరికరాలు త్వరలో తెనాలి రానున్నాయి. తెనాలి ఏరియా వైద్యశాలలో 1998లో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో రక్త సేకరణ జరపటం... వాటిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు పంపి పరీక్షలు జరిపేవారు. అనంతరం వాటిని తెనాలిలోని జిల్లా వైద్యశాలలోని రోగులకు వాటిని ఉపయోగించేవారు. ఇలా జరుగుతుండగా ఆస్పత్రిని జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసి పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి చెంచుపేటలోని నూతన భవనంలోని వైద్యశాలను సుమారు రెండు సంవత్సరాలకు మార్పు చేశారు. జిల్లా వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ కోసం ప్రత్యేక బ్లాక్‌ను కేటాయించారు. అనంతరం అక్కడ రక్త సేకరణ జరిపిందేకు అవసరమైన బెడ్‌లు, కుర్చీలు వంటి వాటిని ఏర్పాటు చేశారు. అలాగే సేకరించిన రక్తాన్ని అక్కడే పరీక్షలు జరిపి వాటిని రోగులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 300 ప్యాకెట్‌ల బ్లడ్‌ను భద్రపరిచే ఫ్రిజ్‌లు ఉన్నాయి. అలాగే పరీక్షలు జరిపేందుకు అవసరమైన పరికరాలు, ముగ్గురు ల్యాబ్ టెక్నిషియన్‌లు, ఒక స్టాఫ్ నర్సు, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిగా ఒక వైద్యురాలిని నియమించారు.

సుమారు 50వేల మందిని ఆదుకున్న బ్లడ్ బ్యాంక్.

తెనాలి బ్లడ్ బ్యాంక్‌లో నెలకు సుమారు 200 ప్యాకెట్‌ల రక్తాన్ని సేకరిస్తున్నారు. ఏడాదికి సుమారు రెండు వేల ప్యాకెట్‌లను రోగులకు పంపిణీ చేస్తున్నారు. జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలోని రోగులకు రక్తం అవసరం అయితే వారికి ఉచితంగా ఇస్తారు. ప్రవేట్ వైద్యశాల రోగులకు అయితే ప్యాకెట్‌కు రూ.800 చొప్పున వసూలు చేస్తుంటారు. తెనాలిలో బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50 వేల ప్యాకెట్‌లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్ వార్డు



ఫ్రీజర్‌లో భద్రపరిచిన బ్లడ్ ప్యాకెట్లు

అలాగే రక్త సేకరణకు ప్రత్యేక వాహనాన్ని కూడా ప్రభుత్వం తెనాలికి పంపింది. దానిని ఉపయోగించి అనేక గ్రామాల్లో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో బ్లడ్ డోనేషన్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు.

తెనాలికి ప్లేట్ లెట్‌లు సేకరించే యూనిట్

తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో డెంగ్యూ బాధితులకు అవసరమైన ప్లేట్‌లెట్స్‌ను సేకరించే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించిన పరికరాలు (బ్లడ్ కాంపోనెంట్ ప్రిపరేషన్ మిషనరీ, ఫ్రిజ్‌లు) త్వరలో తెనాలి రానున్నాయి. సాధారణంగా రక్తంలోఆర్ బీ ఎస్, డబ్ల్యూ బీసీ, ప్లేట్‌లెట్స్ వంటి మూడు రకాల కణాలు ఉంటాయి. నూతనంగా జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేయనున్న యూనిట్ వల్ల వాటిని వేరు చేయవచ్చు. ఆర్‌బీఎస్ రక్తహీనత తక్కువగా ఉన్న వారికి ఉపయోగిస్తారు. డబ్ల్యూబీసీ (పాకర్‌సెల్స్) రియాక్షన్ వచ్చిన వారికి దీనిని ఎక్కించటం వల్ల అది తగ్గుతుంది. డెంగ్యూ సోకిన వారికి ప్లేట్ లెట్స్ తగ్గిపోతాయి. అలాంటి వారికి ప్లేట్ లెట్స్‌ను ఎక్కించటం వల్ల త్వరగా కోలుకునే అవకాశం ఉంది.



ప్రత్యేక వాహనంలో రక్తసేకరణ జరుపుతున్న సిబ్బంది

రక్తదానంతో ఎంతో ఉపయోగం



తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో అనేక మంది దాతలు రక్తదానం చేస్తున్నారు. ఎవరైన క్యాంప్‌లు ఏర్పాటు చేసి తమకు తెలియజేస్తే అక్కడికి తాము వచ్చి రక్తాన్ని సేకరిస్తాం. అలా సేకరించిన రక్తాన్ని అవసరమైన రోగులకు పంపిణీ చేస్తున్నాం. రక్తదానం చేయటం వల్ల పలువురికి ప్రాణదానం చేసిన వారు అవుతారు. రక్తదానం చేయటం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావు. అందరు రక్తదానం చేసేందుకు ముందుకురావాలి.

డాక్టర్ ప్రసన్న, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి, జిల్లా వైద్యశాల, తెనాలి.